


# అనుక్షణం

## - సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల
### (గతసంచిక తరువాయి)

"ఇదే ఫస్ట్ టైం".

"ఇంకేంటి విశేషాలు?"

"ఏముంటాయి నిరంజన్ గారూ.... ఇక నుండి వుంటాయి అనుకుంటాను. పిల్లల కోసం నేను బెంగళూర్ రావటం జరిగింది. కానీ బిజినెస్ పర్పస్ కోసం ఎక్కడికయినా వెళ్లటం కూడా ఇదే మొదటి సారి".

"మీ ఆఫీసులో టూర్లు వుండేవి కాదా?"

"కొంత మందిని పంపేవారు. నేను ముందు నుండి బయటకు వెళ్లటానికి ఇష్టపడేవాడిని కాదు. అందులోనూ నేను ఎడ్మినిస్ట్రేషన్ లో వున్నాను. చివర్లో సెక్షన్ మార్చారు".

"మీకు బదిలీలు వుండేవి కాదా?"

"ఉండేవి. అయితే హెడ్ ఆఫీస్ లో వున్న వారికి కొన్ని సౌకర్యాలు వుంటాయి. బ్రాంచీల్లో పని చేసేవారిని మారుస్తుండేవారు. కొంతమందిని ఫ్రిక్వెంట్ గా ట్రాన్స్ ఫర్ చేసేవారు. నేను బయట నుండి వచ్చిన వాడినే. బదిలీలు తక్కువ" అన్నాడు.

మధ్యలో పైలట్ మాట్లాడుతున్నాడు.

"కాఫీ తీసుకుంటావా?" అన్నాడు నిరంజన్.

"వద్దు" అన్నాడు.

"ఓ.కే." అన్నాడు రెస్ట్ తీసుకుంటానన్నట్లు. అప్పుడు బయటకు చూడటం మొదలు పెట్టాడు. మేఘాలు పరుగులు తీస్తున్నాయి. అత్యంత ఆహ్లాదకరంగా వుంది వాతావరణం.

రాత్రి కళ్యాణి మీద అంత కోపం ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు. తనకి కొంచెం తొందరపాటు వుంది. అయినా ఆనందరావు వాళ్లకి ఇలా కలిసి రావటం పట్ల తనకు జెలస్ గా వుందా అని ప్రశ్నించుకున్నాడు. మనకు తెలియకుండా మనసు పొరల్లో కొన్ని భావాలు గూడు కట్టుకుంటాయి. వాటి ప్రతిబింబాలే మన ఉద్వేగాలు అంటారు కొందరు.

బంధువుల్లో అయినా ఎవరో ఒకరికి కలిసి రానంతకాలం బాగానే వుంటారు. అనుకోకుండా, అనుకోని సమయంలో ఉప్పెనలా డబ్బులు విరుచుకు పడుతుంటాయి. అప్పుడు మాత్రం రకరకాల ఆలోచనలు వస్తుంటాయి. అసలు ఈ రకంగా ఇతరులకి ఏముంది, ఎంత వుంది అని మొదలు పెడితే బతుక్కి తృప్తి వుండదు. మనకంటే ఎన్నోరెట్లు అధికంగా కోట్లాదిమంది బతుకుతుంటారు.

ఉదయం ఇంటి నుండి బయలుదేరే ముందు కూడా కళ్యాణి ముభావంగా వుంది. రాత్రికి పక్కింటి వారి అమ్మాయిని మనింట్లో పడుకోవటానికి రమ్మను అన్నాడు. ఆ అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇది మరీ కొత్త కాలనీ కాకపోయినా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. అయితే ఇంతకు ముందు కొత్తగా ఇల్లు కట్టుకున్న వారు రాత్రి పూట భయం భయంగా వుండేవారు. అప్పట్లో దొంగతనాలు జరిగాయి. ఒకటి రెండు దాడులు కూడా అనుకున్నారు.

ప్రస్తుతం అలాంటి యిబ్బంది లేదు. అయితే పూర్తిగా భరోసాగా వుండటానికి కూడా లేదు. ఇంట్లో ఎవరో ఒకరు వుండటం అవసరం. అదలా వుంటే త్వరలో ఇక్కడో పోలీస్ స్టేషన్ పెడతారని అంటున్నారు. అది జరిగితే కాస్త దొంగలకి భయం వుంటుంది.

కొన్ని వేల అడుగుల ఎత్తులో విమానం ప్రయాణం చేస్తోంది. గంట మాత్రం ప్రయాణం. ఈ మధ్య కాలంలో వెంకటాద్రి అనేక అనుభూతులకు లోనయ్యాడు.

'ఖచ్చితంగా జీవితం మలుపు తిరగబోతోంది. దానికి తగినట్లుగా నన్ను నేను మలుచుకోవాలి. ఇంత వరకు పెద్దగా అనుభవించింది కూడా లేదు. ఓపికంతా అయిపోయాక, ఒంట్లోకి రోగాలన్నీ అడుగు పెట్టాక ఉసూరు మనటం అనవసరం. ఆరోగ్యం వుండగానే తను చేయాలనుకున్న పనులు చేయాల్సి వుంది' అనే నిర్ణయానికి వచ్చాడు.

ప్రయాణం మనుషుల్లో చాలా మార్పులను తీసుకొస్తుంది. విమానం ల్యాండ్ అవుతున్నప్పుడు కుదుపు. అక్కడి నుండి కారులో ప్రయాణం. ఓ హోటల్ దగ్గర ఆగింది. నిరంజన్ రెండు రూమ్స్ తీసుకోవటం ఆశ్చర్యం కలిగించింది. తనకు సింగిల్ బెడ్ రూమ్ తీసుకున్నాడు.

ఇద్దరం కలిసి వుంటే బాగుండేది కదా. అయినా ఇది ఖర్చు. బిజినెస్ అన్నాక ఇలాంటివి తగ్గించుకోవాలి కదా అనుకున్నాడు. అంతలోనే బాస్ కి, ఎంప్లాయ్ కి మధ్య తేడా వుండాలనుకున్నాడా అని కూడా అనిపించింది. తనకి, నిరంజన్ కి కూడా ప్రైవసీ అవసరం. బిజినెస్ డెవలప్ అవుతున్నప్పుడు ఇలాంటి చిన్న చిన్న వాటి గురించి ఆలోచించటంలో అర్థం లేదు. 'థింక్ బిగ్' అనే దాన్ని అలవాటు చేసుకోవాలి అనుకున్నాక కళ్యాణికి ఫోన్ చేయాలా వద్దా అనుకున్నాడు.

"ఇదేంటి కొత్తగా. ఇప్పుడేం జరిగిందని. నా భార్యతో ఇలాంటి చిన్న తగాదాలు ఇంతకు ముందూ జరిగాయి" అని గుర్తు చేసుకున్నాడు. అప్పుడు చేశాడు.

"కళ్యాణీ మేం బెంగళూరు చేరాం. హోటల్ లో రూమ్ తీసుకున్నాం. మరి బయటకు ఎప్పుడు వెళ్తామో తెలియదు".

"మీరు గది బయటకు వచ్చి మాట్లాడుతున్నారా?"

"లేదు. సెపరేట్ గా నాకు రూమ్ యిచ్చారు".

"పిల్లలకు దగ్గరేనా?"

"తెలియదు. ముందు బెంగళూరు చేరాం అని చెప్పటానికి చేశాను. నేనే ఫోన్ చేస్తుంటా" అని కట్ చేశాడు.

హోటల్ నుండి సైట్ కి బయలుదేరి వెళ్లారు. అక్కడ రకరకాల వ్యక్తులు కనిపించారు. కొందరు తెలుగులో మాట్లాడుతున్నారు. మధ్యలో కన్నడ పదాలు తగులుతున్నాయి. అలాగే ఇంగ్లీష్, మధ్య మధ్యలో హిందీ కూడా నడుస్తోంది.

వెంకటాద్రి ఆ పొలాల్ని చూస్తున్నాడు. సుమారు పది ఎకరాలుంటుంది. అతనికి ఎప్పుడు పొలాల్ని చూసినా ఆనందం కలుగుతుంటుంది. వాళ్ల నాన్న స్వయంగా వ్యవసాయం చేసేవాడు. అప్పుడు కొడుకుని వెంటబెట్టుకుని తీసుకు వెళ్లేవాడు.

పంట మీద, నాట్లప్పుడు చేలు అందంగా వుంటాయి.

అవేవీ లేనప్పుడు కూడా భూములు వెంకటాద్రికి నచ్చుతుండేవి. ఈ భూమి మీదనే ఇల్లయినా ప్రపంచ వింతనైనా నిర్మించేది అనుకున్నాడు. అప్పుడు తాజ్ మహల్ గుర్తు వచ్చింది. శివ గుర్తొచ్చాడు. అతను స్త్రీల గురించి మాట్లాడతాడు. అతనికి అబద్ధం చెప్పాడు. తన వెనకాలా ఓ ప్రేమ కథ వుంది.

"వెంకటాద్రీ" అని నిరంజన్ పిలిచాడు. ఉలిక్కిపడి దగ్గరకు వెళ్లాడు. అప్పటికే ఎవరో వచ్చారు. అతనికి పరిచయం చేశాడు. ముందు ముందు తను ఇక్కడికి వస్తుంటాడు అని చెప్పాడు.

ఇంత మంది మధ్య వుంటూ ఆలోచనల్లోకి జారటం తన తప్పు. ముందు పని మీద దృష్టి పెట్టాలి అనుకున్నాడు. ఇందులో డెవలప్ చేసి సైట్లుగా అమ్మేస్తారా? కన్ స్ట్రక్షన్ వుంటుందా అనేది ఇంకా తెలియటం లేదు. అందులోనూ అపార్ట్ మెంట్స్ కడతారా? విల్లాలు వుంటాయా అనేది కూడా. ఏమైనా నిరంజన్ పెద్ద ఎత్తున చేస్తాడు. మరీ చిన్నదయితే బెంగళూరు దాకా రావలసిన అవసరం లేదు.

కాకపోతే ఓ అనుభవం కోసం ముందు చిన్న వెంచర్ తో ఆరంభం అవుతాడు. బెంగళూరులో విపరీతంగా రద్దీ పెరిగిపోయింది. అయితే హైదరాబాద్ లా అక్కడ కూడా వాతావరణం బాగుంటుంది. కొంత మంది బెంగళూరుని ప్రిఫర్ చేస్తుంటారు. అలా వర్క్ కొనసాగుతోంది. తిరిగి కార్లు బయలుదేరాయి. మరో ప్రాంతాన్ని చేరుకున్నారు. మూడు గంటలు దాటాక ఓ చోట లంచ్ చేశారు. మళ్లీ అక్కడ నుండి రెస్ట్ లేకుండా పరుగులు తీస్తూనే వున్నారు.

రూమ్ లోకి సాయంకాలం వచ్చారు. ముందు ఫ్రెషప్ కావాలనుకున్నారు. వెంకటాద్రి స్నానం చేస్తుంటే శివ గుర్తు వచ్చాడు. అతని సెల్ ఫోన్ ఆ మధ్య పోయిందని గుర్తు వచ్చింది. అప్పుడు మళ్లీ 'ఆరుగురు... ' పుస్తకం గుర్తు వచ్చింది. అందులోనూ మిస్సయిన ఫోన్ తో కథ మలుపు తిరిగింది. శివ ఫోన్ ఎలాంటి మలుపు తిరుగుతుందో!

ఆ కథలో ఫోన్ పోగొట్టుకున్న వాడు మాఫియాకి చెందినవాడు. ఇక్కడ 'శివ' అలాకాదు. ఒక్కోసారి తన ఫోన్ కి కూడా కొన్ని కాల్స్ వచ్చేవి. మీకు ఫలానా డ్రాలో లక్షలు వచ్చాయి అంటూ! అలాంటి వాటికి ఇప్పటికీ టెంప్ట్ అవుతూ, రహస్యంగా వారికి ఆ ఛార్జీలకని,ఈ ఖర్చులనీ కొన్ని లక్షలు కట్టి, మోసపోయిన వారు పత్రికల్లో కనిపిస్తూనే వున్నారు. అందులో చదువుకున్న వారున్నారు. నిజం చెప్పాలంటే మొదటి సారి అలాంటి ఫోన్ వచ్చింది. అది ఉత్తరప్రదేశ్ నుండి. ఎవరో హిందీలో మాట్లాడుతున్నారు. అందులోనూ మామూలు మనిషి. చదువుకున్న మనిషిలా అనిపించలేదు.

వెంకటాద్రికి హిందీ వచ్చు. గొప్పగా మాట్లాడకపోయినా తనకు ఎదుటివారు చెప్పేది అర్థం అవుతుంది. అదే సమయంలో తన భావాలను అర్థం అయ్యేలా చెప్పగలడు.

అతను తను చిన్న రైతుని అని, తనకు కొద్ది పాటి పొలం ప్రభుత్వం వారు యిచ్చారని, అందులో రాళ్లూ, రప్పలు, పిచ్చి చెట్లు వున్నాయి అనీ, అతనూ, అతని భార్యా కష్టపడుతూ సాగులోకి తెచ్చుకునే ప్రయత్నంలో రాళ్లు తవ్వుతున్నప్పుడు ఓ కిలో బరువున్న రాయి కనిపించిందన్నాడు. అదేదో మామూలు రాయి అనుకున్నాడు గానీ పరీక్షగా చూస్తే అనుమానం వచ్చిందంట. అది వజ్రం అని అతని నమ్మకం.

దాన్ని చిత్రిక పట్టించాలి. మెషిన్లతో పని చేయిస్తే తప్పకుండా అసలు రూపంలోకి వస్తుంది అన్నాడు.

''అలా చేయవచ్చుకదా. నా కెందుకు ఫోన్ చేశావు'' అని అడిగాడు వెంకటాద్రి.

''నేను నీకు ఎలా తెలుసు. నీ దగ్గర సెల్ ఫోన్ కూడా వుందా?'' అని ప్రశ్నలు అడిగాడు.

''ఉంది బాబూ... తమరెవరో నాకు తెలియదు. నేను మా బంధువులకి ఫోన్ చేశాను. వాళ్లు ఇక్కడ వుండరు. పొరపాటున మీకు వచ్చిందనుకుంటాను''.

''ఇప్పటిదాక గొంతయినా గుర్తు పట్టలేదా?''

''నేను కూలి పనులు చేసుకుని బతికేటోడ్ని. అయ్యన్నీ తెలియవు. అయితే ఇక్కడ మనుషుల్ని నమ్మటానికి లేదు. తమరు ఎక్కడుంటారు!''

''హైదరాబాద్ లో''.

''అక్కడయితే ఎవరికీ తెలియకుండా పని చేసుకోవచ్చు. మీరు నాకు సాయం చేయండి. వచ్చేదానిలో చెరిసగం తీసుకుందాం''.

''అదెలా?''

''మీరు ఇక్కడికి వస్తారా?''

''నేను కాదు. నువ్వు రా'' అన్నాడు వెంకటాద్రి.

''అక్కడికి రావటానికి ఎంత ఖర్చవుతుందయ్యా'' అన్నాడు.

''అది అడిగి తెలుసుకో. నువ్వు రైల్లో వస్తావో, బస్ లో వస్తావో నాకు తెలవదు కదా''.

''దాన్ని జాగ్రత్తగా తీసుకురావాలి. మాలాంటి వాళ్లను చూస్తే పోలీసులకు అనుమానం వస్తుంది. అందుకని తమరు వస్తే బాగుంటుంది'' అన్నాడతను.

అతనితో మాట్లాడటం సరదాగా వుంది. అతను అమాయకుడా, మోసగాడా! తీరా అతని దగ్గరకు వెళ్తే ఏం చేస్తారో, తను మాత్రం అంత పెద్ద వజ్రాన్ని ఎలా తీసుకురాగలడు అనుకున్నాడు. తీసుకువచ్చినా ఇక్కడ వజ్రాల వర్తకుల గురించి తనకు తెలియదు. ఎవరి గురించి తెలుసుకోవాలనుకున్నా అది ఇంకే మాత్రం రహస్యం కాదు.

''అదేదో నువ్వే ఆలోచించుకో. నువ్వు హైదరాబాద్ వస్తే నేను నీకు ఏదన్నా చేయగలను. మళ్లీ ఫోన్ చెయ్యి'' అని కట్ చేశాడు.

తర్వాత తన మాటలకి, అప్పటికప్పుడు పుట్టుకొచ్చిన రకరకాల ఆలోచనలకి తనకే ఆశ్చర్యం కలిగింది. అప్పట్లో విశాఖపట్టణం కొండల్లో రంగురాళ్లు గురించి విపరీతంగా వార్తలు వచ్చాయి. అలాగే అనంతపురం ప్రాంతాల్లో వజ్రాలు దొరుకుతాయి అంటారు. రాళ్లు దొరికాయని వార్తలు చదివాడు. అవి వజ్రాలా, విలువైన రంగురాళ్లా అనేది తెలియదు.

అలాంటి వార్తలు వస్తుంటాయి. తమ ఆఫీస్ లో సాటి ఉద్యోగులు ఇవన్నీ మాట్లాడుకుంటుండేవారు. మనం రెండు వారాలు సెలవు పెట్టి వజ్రాల వేటకి వెళ్దామా! ఎవరి అదృష్టం ఎలా వుంటుందో తెలియదు. నాలుగు రాళ్లు వెనకేయటం అంటే ఇదే. దొరికితే పండగ. లేకపోతే టూర్ వెళ్లి వచ్చినట్లు అనుకుంటాం అనేవారు–నవ్వుతూ.

ఓ కోలీగ్ అనేవాడు.

''కష్టపడి సంపాదిద్దాం'' అని ఒక్కడన్నా అంటాడేమోనని ఎదురుచూస్తుంటా. అబ్బే... మనకి లక్షలకి లక్షలూ, కోట్లూ బేవార్సుగా వచ్చి మీద పడిపోతుండాలి. ఈ ఉద్యోగం వస్తే చాలు అనుకున్న రోజులున్నాయి. ఎలా అయినా ఈ ఉద్యోగం రెగ్యులర్ అయితే తిరుమల వస్తాం అని మొక్కుకున్న రోజులు గుర్తు చేసుకోండి. ఇక్కడ హెడ్ ఆఫీసులో కూర్చుంటే ఏముంది. బ్రాంచిల కెళ్లండి. అక్కడ లంచాలు దొరుకుతాయి'' అని క్లాసు తీసుకునేవాడు.

అదయితే నిజమే. ఫీల్డ్ లోకి వెళ్లే వారికి పై డబ్బులు వచ్చే అవకాశాలుంటాయి. వాళ్లు ప్రొక్యూర్ చేస్తారు. అలాగే ఎగుమతులు, దిగుమతులుంటాయి. అలాంటి చోట్ల పది రూపాయలు వస్తాయి. బ్రాంచీల్లో పని చేసే వాళ్ల గురించి రకరకాల కథలు చెప్పుకునేవారు.

అతను ఏదొక రోజు వస్తాడని, మళ్లీ ఫోన్ వస్తుందని వెంకటాద్రి ఎదురు చూశాడు. ఆ నెంబరు కూడా కొంత కాలం తన దగ్గర వుండేది. తర్వాత కాలంలో రకరకాల మెసేజ్ లూ, ఫోన్లూ వచ్చేవి. క్రమంగా అలా వచ్చిన వాటిని డిలీట్ చేయటం మొదలు పెట్టాడు.

టాప్ లో నుండి నీళ్లు వస్తూనే వున్నాయి. అలా ఒంటిని తడుపుతున్నాడు. రకరకాల జ్ఞాపకాలు. బాత్ రూమ్ నుండి బయటకు వచ్చాడు. లుంగీ తీసి కట్టుకున్నాడు. పిల్లలకి ఫోన్ చేద్దామా అనుకున్నాడు. ఇప్పుడు మళ్లీ బయటకు వెళ్లాల్సి వుంటుందేమో తెలియదు. అందుకని కొడుకు నెంబర్ కి ప్రయత్నం చేశాడు. అది స్విచ్ ఆఫ్ అయివుంది.

నిరంజన్ ఏం చేస్తుంటాడు అనిపించింది. తన రూమ్ కి వెళ్తేనో అనిపించింది. రాత్రికి డిన్నర్ కి ఇన్వైట్ చేస్తాడో, రూమ్ కి తెప్పించుకోమంటాడో తెలియదు.

అదలా వుంటే అతనికి ఓ అమ్మాయి మాత్రం వుందని తెలుసు. తను కూడా చదువుకుంటోంది హైదరాబాద్ లోనే. ఇంత వరకు ఎప్పుడూ ఇంటికి రమ్మన లేదు. అతనికి రెండు కార్లు వున్నాయి. మూర్తి ఆ విల్లా చూశాడంట. బాగుంటుంది అన్నాడు.

నిరంజన్ గారు కూడా ఈ సిటీకి మనలా పొట్ట చేత్తో పట్టుకుని వచ్చాడు. అంతకు ముందు కొంత మంది దగ్గర ఉద్యోగాలు చేశాడు. అప్పుడే ఆ మెళకువలు తెలుసుకుని స్వంతంగా వ్యాపారాలు మొదలు పెట్టాడు. కాలం కలిసొచ్చింది అంటాడు మూర్తి.

వాళ్ల అమ్మాయి ఇంటర్ మీడియట్ చదువుతుందంట.

''అంటే మా వాడి కంటే చిన్నదే'' అనుకున్నాడు.

ఇంతలో ఫోన్ రింగయింది.

''వెంకీ నా రూమ్ కి ఓ సారి రా'' అని నిరంజన్. అయిదు నిముషాల తర్వాత వెళ్లాడు.

అక్కడ ఎవరూ లేరు. 'కూర్చో' అన్నాడు. కూర్చున్నాక...

''మీ పిల్లలు ఇక్కడ చదువుకుంటున్నారు అన్నావు. విడిగా ఓ పోర్షన్ తీసుకున్నారా?''

''లేదు. హాస్టల్ లో వుంటున్నారు''.

''ఇద్దరూ బాగా చదువుతారా?''

''నైన్టీ పర్సెంట్ కి తగ్గరు'' అన్నాడు వెంకటాద్రి.

''ఈసారి కలుసుకోవటం కుదరకపోవచ్చు అనుకుంటాను''.

''ఫర్వాలేదు. అయినా అనుకోకుండా మనం బయలుదేరాం కదా. నా జీవితంలో నేను మొదటి సారి ఫ్లయిట్ లో ట్రావెల్ చేయటం నుండి కొత్త అనుభవాలు వస్తున్నాయి. ముందు నాకు రెవిన్యూ డిపార్ట్ మెంట్ గురించి బొత్తిగా తెలియదు. మామూలుగా భూములు అమ్మటం కొనటం అనుకున్నాను. ఇన్ని రకాల భూములుంటాయని తెలియదు. అడంగులు, పహాణీలు, ఎక్కడి కక్కడ గజాలు, గదులు, అంకణాలు ఇలాంటివి వింటుంటే నాకు ఎప్పుడూ కొత్తగా వుంటుంది''.

"ఇందులో రహస్యం ఏమీ లేదు. కొన్ని విషయాలు మనకు అనవసరం అనుకుని వాటి జోలికి పోం. ఇక నుంచి స్టడీ చేయాలి. అసలు మనుషులు నిజాయితీగా వుండటం మానేశారు. ఎక్కడికక్కడ లొసుగులు వెతకటమే పని. అసలు సరైన చట్టం ఒకటి తీసుకొస్తే చాలు. అన్ని వివాదాలు వుండవు. అలా చేస్తే ఎవరికీ డబ్బులు రావు. అందుకే ఈ దేశంలో ఎప్పటికి రాని కొన్ని చట్టాల్లో పార్టీ ఫిరాయించేవాడి పదవి రద్దు అయిపోతుంది అని ఏ పార్టీ వారూ చేయరు" అన్నాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు. అప్పుడు నిరంజన్ కొద్ది సేపు ఏదో ఆలోచిస్తుండిపోయాడు. తర్వాత మాట్లాడాడు.

"మనకి మొదటి సారి చేసిన పనులు అంత త్వరగా మరపుకి రావు. అది తొలిప్రేమ కావచ్చు. మొదటి సాహసం, మొదటి యాక్సిడెంట్. అలాగే మొదటి ప్రయాణాలు ఇలా చాలా వున్నాయ్. ఒకప్పుడు అందరూ సామాన్యులే. మెల్లగా అభివృద్ధి చెందారు".

"అవును".

"మనకంటూ ఓ గాడ్ ఫాదర్ వుండాలి. అప్పుడు మన జీవితం మారుతుంది. ఒక్కోసారి వారు మనకు పరిచయం కాకపోవచ్చు. అదృశ్యంగా కొందరుంటారు. అలాగే మనం కొంతమందిని ఆరాధిస్తాం. వారిని ప్రేరణగా తీసుకుంటాం. అలా కూడా పైకి రావటానికి అవకాశం వుంటుంది. కాకపోతే అసలు శ్రమపడను, తెలివి తేటలు ప్రయోగించనంటే కుదరదు".

నిరంజన్ మాటల వెనక వున్న సందేశం ఏమిటి అన్న ఆలోచనలో వెంకటాద్రి పడ్డాడు.

"నన్ను కూడా కొంతమంది అఫ్ కోర్స్ ఒకరిద్దరు పైకి తీసుకు వచ్చారు. అలా అని వారు నాకు బంగారు పళ్లెంలో అన్నీ అమర్చి ఇవ్వలేదు. వారి అనుభవాలను దాచుకోలేదు. వాటిని నేను స్టడీ చేశాను. నేను అలాంటి వారి నుండి బయటకు వెళ్తానన్నప్పుడు నన్ను వ్యతిరేకించలేదు. ఆల్ ది బెస్ట్ చెప్పారు. అలాంటి వారితో ఇప్పటికీ నాకు రిలేషన్స్ వున్నాయి. వీడు నా దగ్గర పని చేశాడు అనే లాంటి జెలసీలు వారికి వుండవు" అన్నాడు నిరంజన్.

"అలాంటి మనుషులుంటారు. అయినా మీరు అదృష్టవంతులు".

"నువ్వు అదృష్టవంతుడివి కాదా వెంకీ".

మాట్లాడలేకపోయాడు.

"గుర్తు పెట్టుకో... మనుషులందరికీ అవకాశాలు రావు అనుకుంటారు. అది నేను ఒప్పుకోను. జీవితంలో ఎప్పుడు, ఏ వయసులో, ఏ రూపంలో అలాంటిది వస్తుందో తెలియదు. తప్పకుండా వస్తుంది. అది గుర్తించాలి. దాన్ని ఉపయోగించుకోవాలి. అప్పుడు జీవితం మలుపు తిరుగుతుంది".

"మీరు చెప్పింది నేను ఒప్పుకుంటాను. అదే సమయంలో అదృష్టం తాలూకు అవకాశాలేనా, జీవితాన్ని మలుపు తిప్పే దురదృష్టకర అనుభవాలు వచ్చి మన జీవితాల్ని తలకిందులు చేయవా?"

నిరంజన్ ముఖంలో ఫీలింగ్స్ మారిపోయాయి.

''అవీ వుంటాయి. రెండూ కలిస్తేనే కదా జీవితం'' అని...

''నువ్వు డ్రింక్ చేస్తావా?''

''అదీ... ఇంత వరకు అసలు టచ్ చేయలేదు అనను. చాలా కాలం నేను మద్యం తాగలేదు. ఏదో ఓ సందర్భంలో బలవంతం చేశారు. తప్పని స్థితి. తర్వాత అకేషనల్ గా. నా మందు అనుభవం చాలా చిన్నది. వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు''.

''నీకు అభ్యంతరం లేదు కదా... జస్టే మినిట్'' అని బజర్ నొక్కాడు. తర్వాత ఆర్డర్ చేశాడు. స్టార్టర్స్ తో పాటు కొన్ని నాన్ వెజ్ ఐటమ్స్.

పావుగంట తర్వాత 'ఛీర్స్' అనుకున్నారు.

''నేను కూడా రెగ్యులర్ డ్రింకర్ని కాదు. ఫ్యాక్టరీ వ్యవహారాల్లో ఆఫీసర్లని కలవాల్సి వుంటుంది. వారిలో ఎక్కువ భాగం డ్రింక్ చేయటానికి అలవాటు పడ్డారు. పార్టీలు ఇవ్వ వలసి వుంటుంది. డబ్బు చేయలేని పనులు కొన్ని మద్యం చేస్తుంది. ఇది నా అనుభవం''.

వెంకటాద్రి చిన్నగా నవ్వాడు.

''ఇందాక నువ్వు దురదృష్టకర అనుభవాలు అన్నావు. మా ఇంట్లోనే అలాంటివి వున్నాయి. మాకు ఒకప్పుడు వంద ఎకరాల భూమి వుండేదంట. అది మా తాత హయాంలోనే హారతి కర్పూరంలా కరిగిపోయింది. మా నాన్న దగ్గరకి వచ్చేటప్పటికీ ఏమీ లేదు. ఆయన పొలాల మీద సూపర్ వైజర్ గా పనిచేశాడు. ఇప్పుడు నన్ను చూసి కొంతమంది అనుకుంటారు. వీళ్ల సంగతి మాకు తెలియదా. మోతుబరి రైతుల దగ్గర చేతులు కట్టుకుని నిలబడ్డారు అని. అందులో తప్పేముంది. గవర్నమెంట్ ఆఫీసుల్లో బాస్ లు వుంటారు. వారి సబార్డినేట్ లు సబ్ మిసివ్ గా వుంటారు కదా!''

''అది సహజం. ఇలాంటి విమర్శలు అనేక రకాలుగా వుంటాయి. మనం పట్టించుకోకూడదు''.

''నేను పట్టించుకున్నానని కాదు వెంకీ. అలాంటి వారు తమ గతం గురించి ఆలోచించరు. ఇప్పుడు తాము రోడ్డు మీద వున్నాం అనుకోరు. ఈ మధ్య తరగతి ఎంత గొప్పదో అంత అసహ్యకరమైంది కూడా అందుకే ఇందులో ఎక్కువ శాతం మంది ఎదగరు. ఆ బావి చుట్టూనే తిరుగుతారు''

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS